క్లుప్తంగా

పోలీసుల తీరు సరికాదు



మాట్లాడుతున్న గొర్లె కిరణ్‌కుమార్

జి.సిగడాం: ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తిచూపుతున్న సాక్షి పత్రిక ఎడిటర్, విలేకరుల పట్ల పోలీసుల వ్యవహార శైలి సరిగ్గా లేదని ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ అన్నారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పేద ప్రజలకు సంక్షేమ పథకాలు అందకుండా కూటమి ప్రభుత్వం కుట్ర చేస్తోందని దుయ్యబట్టారు. మెడికల్ కాలేజీల ప్రయివేటీకరణ నిరసిస్తూ మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు కోటి సంతకాల సేకరణ చేపడుతున్నట్లు వివరించారు.

కేసులు అప్రజాస్వామికం



పిన్నింటి సాయికుమార్

రణస్థలం: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక సాక్షి పత్రికపై వేధింపులు ఎక్కువ కావడం దురదృష్టకరమని ఎచ్చెర్ల నియోజకవర్గ వైఎస్సార్ సీపీ నాయకుడు పిన్నింటి సాయికుమార్ అన్నారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రజలపక్షాన గొంతు వినిపించే స్వేచ్ఛ రాజ్యాంగం పత్రికలకు కల్పించిందని, ఇటీవల నకిలీ మద్యం వార్తలను సాక్షి పత్రిక ప్రచురించడంతో అక్రమ కేసులు బనాయించడం దుర్మార్గమన్నారు. పోలీసుల చర్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని పేర్కొన్నారు.

గుర్తింపుకార్డుల పంపిణీ



ఐడీ కార్డులను అందజేస్తున్న బార్ అధ్యక్ష కార్యదర్శులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లా న్యాయవాదులు బార్ అసోసియేషన్‌లో న్యాయవాదులకు శుక్రవారం గుర్తింపు కార్డులు పంపిణీ చేశారు. బార్ అధ్యక్షుడు తంగి శివప్రసాద్, ప్రధాన కార్యదర్శి పిట్టా దామోదరరావు ఆధ్వర్యంలో వీటిని అందజేశారు. కార్డులు కావాల్సిన న్యాయవాదులు అధ్యక్ష, కార్యదర్శులను సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు, బార్ అసోసియేషన్ సీనియర్, జూనియర్ న్యాయవాదులు, మహిళా న్యాయవాదులు పాల్గొన్నారు.

వీధి వ్యాపారులకు తోడ్పాటు



సమావేశంలో మాట్లాడుతున్న పీడీ వెంకటరావు

శ్రీకాకుళం: వీధి వ్యాపారుల ఆర్థిక స్థిరత్వానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపడుతున్నట్లు మెప్మా పీడీ ఎస్.వెంకటరావు తెలిపారు. పీఎం స్వానిధి పథకం అవగాహనా కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మునిసిపల్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ చిరు వ్యాపారులకు తగిన గుర్తింపు కార్డుల మంజూరు, రుణ సౌకర్యంతో పాటు కొత్తగా క్రెడిట్ కార్డ్ పాలసీ కూడా అందుబాటులోకి తీసుకువచ్చినట్లు చెప్పారు. శ్రీకాకుళం నగరపాలక సంస్థ, ఆమదాలవలస, పలాస-కాశీబుగ్గ, ఇచ్ఛాపురం పురపాలక సంఘాలలో మున్సిపల్ కమిషనర్ సారథ్యంలో మెప్మా సిబ్బంది ఈ పథకం అమలు చేస్తారని వివరించారు. ఇండియన్ బ్యాంకు మేనేజర్ ఎం.నారాయణ మాట్లాడుతూ డిజిటల్ పేమెంట్ విధానంలో మెలకువలపై వివరించారు. కార్యక్రమంలో సీఎంఎం జి.కిషోర్‌బాబు, సిబ్బంది, ఆర్పీలు, వీధి విక్రయదారులు పాల్గొన్నారు.

మడ్డువలస కాలువ ఆధునీకరణపై దృష్టి



దేవరవలస వద్ద మడ్డువలస కాలువను పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ నాగబాబు

జి.సిగడాం: మడ్డువలస ప్రాజెక్ట్ కుడి కాలువ ఆధునీకరణ పనుల విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని ఎమ్మెల్సీ కె.నాగబాబు అన్నారు. శుక్రవారం దేవరవలస గ్రామ సమీపంలో 70 అడుగుల లోతులో ఉన్న కాలువను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు సాగునీరు అందించేందుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ తిరుమరెడ్డి వెంకటరావు, ఉమ్మడి జిల్లా కార్యదర్శి తాళాబత్తుల పైడిరాజు, ఎచ్చెర్ల నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ విష్వక్సేన్ పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం నేడు

గార: మండల పరిధిలోని చల్లపేట సబ్‌స్టేషన్‌కు వచ్చే విద్యుత్ లైన్‌లో మరమ్మతులు కారణంగా శ్రీకూర్మంతో పాటు వాడాడ, రామచంద్రాపురం, గొంటి, బలరాంపురం, చల్లపేట గ్రామాలకు శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ ఏఈఈ పైడి యోగేశ్వరరావు తెలిపారు.

మస్టర్ల మాయాజాలానికి చెక్ పడేనా..!



అంబటివానిపేటలో ఈ-కేవైసీ నమోదు చేసుకుంటున్న వేతనదారులు

- ఉపాధి హామీ వేతనదారులందరికీ ఈ-కేవైసీ తప్పనిసరి
- ఆధార్, జాబ్‌కార్డుల అనుసంధానంలో ముఖ ఆధారిత హాజరు

గార: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అమలులో అక్రమాలకు అడ్డుకట్ట వేసేలా కేంద్ర ప్రభుత్వం సరికొత్త మార్పులకు రంగం సిద్ధం చేసింది. ప్రతి ఏడాది తలనొప్పిలా మారుతున్న మస్టర్ల మాయాజాలానికి చెక్‌పెట్టేందుకు వేతనదారులకు ఈ-కేవైసీ తప్పనిసరి చేసింది. వేతనదారులు తమ ఆధార్ కార్డును జాబ్‌కార్డుతో అనుసంధానం చేసుకోవడంతో పాటు ముఖ ఆధారిత హాజరు ఉంటేనే వేతనదారులకు పని కల్పించాలని నిర్ణయించింది. ఈ ఏడాది నవంబర్ ఒకటో తేదీ నుంచి ఈ విధానం ద్వారా పనులు కల్పించాలని నిర్ణయం తీసుకుంది. ఉపాధి హామీ పథకం పనుల్లో పారదర్శకత కొరవడిందన్న ఆరోపణలున్న నేపథ్యంలో ఈ కొత్త విధానానికి శ్రీకారం చుట్టింది.



తండ్యాలపేటలో ఈ- కేవైసీ ప్రక్రియ

దేశమంతటా అమలు..

కొంతమంది వేతనదారులు పనులకు రాకపోయినా ఉపాధి హామీ సిబ్బంది వారంతా హాజరైనట్లు నమోదు చేస్తూ నిధులు స్వాహా చేసేవారని సామాజిక తనిఖీల ద్వారా బయటపడేది. అవకతవకలపై ఉన్నతాధికారులకు వేతనదారుల నుంచి ఫిర్యాదులు అందుతున్నాయి. ఈ నేపథ్యంలో దేశమంతటా వ్యవస్థలో మార్పులు చేసేందుకు సిద్ధమయ్యారు. బోగస్ మస్టర్లకు చెక్ పెట్టాలని నిర్ణయంలో భాగంగా క్షేత్రస్థాయిలో అవినీతికి పాల్పడకుండా వేతనదారుల జాబ్‌కార్డులో ఉన్న కుటుంబ సభ్యులందరితో కచ్చితంగా ఈ కేవైసీ (ఎలక్ట్రానిక్ నో యువర్ కస్టమర్) ధృవీకరణ చేయాలని ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు గ్రామాల్లో పనికి వెళ్లే వేతనదారులకు అధికారులు, సిబ్బంది ఈ-కేవైసీ నమోదు చేస్తున్నారు.

ఇకపై పనికి వెళ్తేనే..

శ్రీకాకుళం నియోజకవర్గంలో రూరల్ మండలంలో 22472 మంది వేతనదారులుండగా, వీరిలో 17,552 మంది, గార మండలంలో 28288 మందికి గాను 20,472 వేతనదారులు ఈ- కేవైసీ నమోదు పూర్తయింది. ఇప్పటికే 72 శాతం మేర ఈ-కేవైసీ ప్రక్రియ పూర్తి చేశారు. జాతీయ మస్టరు పర్యవేక్షణ సంస్థ (ఎన్ఎంఎంఎస్) యాప్‌లో వేతనదారుల వివరాలు నమోదు చేస్తున్నారు. ముఖ ఆధారిత హాజరు కోసం యాప్‌లో నమోదు చేయడంతో పాటు కనుపాప (ఐరిష్) తీసుకుంటున్నారు. నేత్రానికి సంబంధించి ఎవరైనా దివ్యాంగులుంటే వారి నుంచి బయోమెట్రిక్ ద్వారా వివరాలు సేకరిస్తారు. ఈ విధానంలో మృతుల పేర్లు నమోదు చేసే వీలుండదు. క్షేత్రస్థాయిలో పనికి వెళ్లిన వారు ఫొటోలో ఉంటేనే వేతనం పడనుంది.

నెలాఖరులోగా పూర్తి



ఉపాధి హామీ పథకం వేతనదారులంతా ఈ-కేవైసీ నమోదు ప్రక్రియను నెలాఖరులోగా పూర్తి చేయాలని ఆదేశాలందాయి. అర్హులందరికీ ఉపాధి పథకం ద్వారా పనులు కల్పిస్తాం. ఈ- మస్టరును మరింత పారదర్శకంగా అమలు చేసేందుకు ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది.

– ఈశర్ల రఘు, ఎంపీడీఓ, గార

అత్యుత్తమ ఫలితాల సాధనే లక్ష్యం

శ్రీకాకుళం న్యూకాలనీ: ఇంటర్మీడియెట్ ఫలితాల్లో శ్రీకాకుళం జిల్లాను రాష్ట్రంలో ముందంజలో నిలిపేలా ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు కృషి చేయాలని జిల్లా డీవీఈఓ/ఆర్ఐఓ రేగ సురేష్‌కుమార్ అన్నారు. శుక్రవారం శ్రీకాకుళం ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలను ఆకస్మికంగా తనిఖీచేశారు. విద్యార్థుల హాజరు, అధ్యాపకుల హాజరు, టీచింగ్ నోట్స్, టీచింగ్ డెయిరీలు, మార్కుల నమోదు రిజిస్టార్లు, పిల్లల నెలవారీ హాజరు జాబితాలు, ఇతర అకడమిక్ రికార్డులను, ల్యాబ్‌లను పరిశీలించారు. ఈ నెల 22 నుంచి 24 వరకు జరిగే మూడో యూనిట్ పరీక్షలకు విద్యార్థులంతా హాజరయ్యేలా చూడాలన్నారు. సైన్స్ విద్యార్థులను నీట్, జేఈఈ, ఎంసెట్ వంటి పోటీపరీక్షలకు సన్నద్ధంచేసే క్లాసులు, పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు. సైన్స్ విద్యార్థులను ప్రాక్టికల్స్ సిద్ధం చేయాలని, బ్యాచ్‌లవారీగా కేటాయించి పరీక్షలకు సిద్ధంచేయాలని సూచించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ జి.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



కంప్యూటర్ ల్యాబ్‌ను పరిశీలిస్తున్న డీవీఈఓ

వైభవంగా ఆదిత్యుని కల్యాణోత్సవం

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణస్వామి కల్యాణ సేవ శుక్రవారం ఉదయం అనివెట్టి మండపంలో ఘనంగా జరిగింది. ఆశ్వీయుజ బహుళ ఏకాదశి పర్వదినం సందర్భంగా ఉషా పద్మిని ఛాయా దేవేరులతో సూర్యనారాయణ స్వామి వారి ఉత్సవమూర్తులను కల్యాణమూర్తులుగా అలంకరించి అనివెట్టి మండపంలో వేంచేసింపజేసి ఆగమ శాస్త్ర ప్రకారం కల్యాణ సేవ నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ, సాందీప్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

నైపుణ్యాలు మెరుగుపర్చుకోవాలి

శ్రీకాకుళం న్యూకాలనీ: మారుతున్న పోటీప్రపంచానికి అనుగుణంగా విద్యార్థులు నైపుణ్యాలను మెరుగుపర్చుకోవాలని శ్రీకాకుళం ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సూర్యచంద్రరావు అన్నారు. కళాశాలలో ఏపీఎస్ఎస్‌డీసీ, యునెక్ట్స్ సహకారంతో నెలరోజులుగా ఉన్నతి పేరిట నిర్వహిస్తున్న సాఫ్ట్‌స్కిల్స్ శిక్షణా తరగతులు శుక్రవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతు శిక్షణా తరగతుల్లో నేర్చుకున్న అంశాలను ప్రాక్టికల్స్ రూపంలో తెలుసుకోవాలన్నారు. ఉన్నతి ట్రైనర్ ఈశ్వరరావు మాట్లాడుతు సాఫ్ట్ స్కిల్స్, కమ్యూనికేషన్ స్కిల్స్, ఎంప్లాయిబిలిటీ స్కిల్స్ తదితర అంశాలపై 60 మంది విద్యార్థులకు శిక్షణ అందించినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఏపీఎస్ ఎస్‌డీసీ కోఆర్డినేటర్ వాణికుమారి, డాక్టర్ చిన్నారావు, కె.మౌనిక, డాక్టర్ పద్మావతి, టి.ఆదిలక్ష్మి, జేకేసీ కోఆర్డినేటర్ ఐ.శ్రీలక్ష్మి, ఎస్.మాధవీలత, వి.శైలజ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ డాక్టర్ సూర్యచంద్రరావు

బొప్పాయి సాగు.. లాభాలు బాగు

- ఎచ్చెర్ల నియోజకవర్గంలో 250 ఎకరాల విస్తీర్ణంలో పంట
- సాగుపై ఆసక్తి చూపుతున్న రైతులు

ఎచ్చెర్ల : ఆరోగ్య జాగ్రత్తల్లో భాగంగా ప్రతి ఒక్కరూ తీసుకునే పండ్లలో బొప్పాయిది ప్రథమ స్థానం. మధుమేహ వ్యాధితో బాధపడుతున్న వారు సైతం బొప్పాయి తినొచ్చని వైద్యులు సూచిస్తుంటారు. మనిషిలో రక్తాన్ని శుద్ధిచేసే గొప్పగుణం ఈ పండ్లకు ఉంటుంది. అందుకే మార్కెట్‌లో మంచి గిరాకీ ఉంది. ఈ నేపథ్యంలో ఎచ్చెర్ల నియోజకవర్గ రైతులు బొప్పాయి సాగుకు ఆసక్తి కనబరుస్తున్నారు. క్రమంగా పంట సాగు విస్తీర్ణం పెరుగుతోంది. బొప్పాయి సాగుపై ఉద్యానవన శాఖ అధికారులు రైతులకు సూచనలు అందిస్తున్నారు.

గత ప్రభుత్వ రాయితీలు కొనసాగింపు..

బొప్పాయి సాగుకు గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అందించిన రాయితీలు, ప్రోత్సాహకాలను ప్రస్తుత ప్రభుత్వం కూడా కొనసాగిస్తోంది. నియోజకవర్గంలో ఎచ్చెర్ల, లావేరు, రణస్థలం, జి.సిగడాం మండలాల్లో 250 ఎకరాల్లో బొప్పాయి సాగు చేస్తున్నారు.స్థానిక వ్యాపారులతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి పెద్ద ఎత్తున వ్యాపారులు పొలాల వద్దకే వచ్చి పంటను కొనుగోలు చేస్తున్నారు. దీంతో రైతులకు రవాణా ఖర్చు తగ్గుతోంది.

అన్నీ అనుకూలిస్తే భలే ఆదాయం..

బొప్పాయి సాగులో రైతులు మంచి లాభాలు అర్జించవచ్చని ఉద్యానవన శాఖాధికారులు చెబుతున్నారు. అధికారులు సూచనలు పాటిస్తూ సస్యరక్షణ చర్యలు చేపడుతూ వాతావరణం అనుకూలిస్తే ఎకరాకు 60 టన్నుల వరకు పంట దిగుబడి వస్తుందని అంటున్నారు. ఎకరా సాగుకు రూ.70 వేల వరకు ఖర్చు అవుతుందని దిగుబడి బాగుంటే మూడు లక్షల రూపాయల వరకూ ఆదాయం పొందవచ్చని అధికారులు చెబుతున్నారు.



బొప్పాయి పంట

రాయితీపై పరికరాలు..

బొప్పాయి సాగుకు హెక్టారుకు రూ.18,500 రాయితీగా ప్రభుత్వం అందజేస్తోంది. ఈ రాయితీ కోసం రైతులు రైతు సేవా కేంద్రంలో దరఖాస్తు చేసుకుని విత్తనాలు, ఎరువులు, స్ప్రేయింగ్ కెమికల్స్ బిల్లులు, పంట ఫోటో జతచేయాల్సి ఉంటుంది. పంట సాగులో మల్చింగ్ కోసం మొక్క చుట్టూ మట్టిని కప్పి ఉంచడానికి పాలిథిన్ ఫిల్మ్ కప్పాల్సి ఉంటుంది. దీంతో మొక్క వృద్ధి చెందుతుంది. దీని కోసం హెక్టారుకు రూ.16 వేలు అందించనున్నారు. మైక్రో ఇరిగేషన్‌లో భాగంగా డ్రిప్ పరికరాలు కావాల్సిన రైతులకు హెక్టారుకు రూ.80 వేల విలువైన పరికరాలను రాయితీపై అందిస్తున్నారు.

అవగాహన కల్పిస్తున్నాం

బొప్పాయిసాగుకు ప్రభుత్వం అందిస్తున్న రాయితీలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి. హెక్టారుకు రూ.18,500 సాగు ప్రోత్సాహంతో పాటు మల్చింగ్ కోసం రూ.16 వేలు అందజేస్తున్నారు. డ్రిప్ కోసం హెక్టారుకు రూ.80 వేల వరకు రాయితీ కల్పిస్తున్నారు.

– సుదర్శిని, ఉద్యానవన శాఖాధికారి, ఎచ్చెర్ల

వృద్ధుల యోగక్షేమాలపై ఆరా



వృద్ధులతో మాట్లాడుతున్న డీఎల్ఎస్ఏ కార్యదర్శి హరిబాబు

శ్రీకాకుళం పాతబస్టాండ్: తలసేమియా వ్యాధిగ్రస్తులకు మెరుగైన వైద్యం అందించాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.హరిబాబు అన్నారు. శుక్రవారం నగరంలోని శాంతా అనురాగ నిలయాన్ని సందర్శించారు. వృద్ధులతో మాట్లాడి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఈ వయసులో పిల్లల వద్ద ఉంటే ఎంతో మనఃశాంతి ఉంటుందని, కానీ వారిని వృద్ధాశ్రమాలలో చేర్పించడం బాధాకరమన్నారు. కార్యక్రమంలో అనురాగ నిలయం సిబ్బంది పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలపై వినతి



డీఈఓకు సమస్యలు వివరిస్తున్న డీటీఎఫ్ నాయకులు

శ్రీకాకుళం : జిల్లాలో పాఠశాలల పునర్నిర్మాణం సందర్భంగా జరిగిన లోపాలను సరిచేయాలని డీటీఎఫ్ జిల్లా నాయకులు పూజారి హరిప్రసన్న కోరారు. ఈ మేరకు శుక్రవారం జిల్లా విద్యాశాఖ అధికారి రవిబాబుకు వినతిపత్రం అందజేశారు. లోపాలు సరిజేయడం ద్వారా విద్యార్థులకు, తల్లిదండ్రులకు న్యాయం జరిగేలా చూడాలన్నారు. పొందూరు మండలం కింతలి, కోటిపల్లి, వావిలాపల్లిపేట, భగవాన్‌దాస్‌పేట తదితర పాఠశాలల్లో విద్యార్థులు భౌతికంగా ఒకచోట, సాంకేతికంగా మరోచోట పేర్లు ఉండటంతో అక్కడ ఉపాధ్యాయులు, విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ఇదే సమస్య జిల్లా వ్యాప్తంగా అనేకచోట్ల ఉందని, వీటిని గుర్తించి రాష్ట్రస్థాయి అధికారులతో మాట్లాడి పరిష్కరించాలని కోరారు.

విద్యార్థినికి అభినందనలు



హాసినిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్ సంధ్య

శ్రీకాకుళం న్యూకాలనీ: నగరంలోని హయాతీనగరంలోని ఉన్న మహాత్మజ్యోతిబా పూలే ఏపీ వెనుకబడిన తరగతుల బాలికల సంక్షేమ గురుకుల పాఠశాల 9వ తరగతి విద్యార్థిని పెయ్యిల హాసినిని ప్రిన్సిపాల్ పి.సంధ్య అభినందించారు. శుక్రవారం శ్రీకాకుళంలో జరిగిన జిల్లా స్థాయి సైన్స్ సెమినార్-2025 పోటీల్లో రెండో స్థానంలో నిలిచి బహుమతి, ప్రసంశాపత్రాన్ని అందుకోవడంతోపాటు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైంది. ఈ సందర్భంగా విద్యార్థినితో పాటు ఉపాధ్యాయినిలను ప్రిన్సిపాల్ అభినందించారు.

ముమ్మరంగా ట్యాంకుల శుభ్రత



కళింగపట్నంలో ట్యాంకులో నాచు, బురదను తొలగిస్తున్న దృశ్యం

గార: కళింగపట్నం పంచాయతీ గ్రామాల్లో తాగునీటి ట్యాంకులను గురు, శుక్రవారాల్లో శుభ్రం చేశారు. 'బురద నీరే.. తాగునీరు' పేరిట ఈ నెల 15న సాక్షిలో వార్త ప్రచురితం కావడంతో అధికారులు స్పందించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పంచాయతీ కార్యదర్శి చల్ల ప్రవీణ్ బురద నీరు సమస్య గుర్తించి ట్యాంకుల క్లీనింగ్ పనులు జరిపించారు. సిలగాం, తాన్‌సాహెబ్‌పేట, నగరాలపేట, ఎస్సీకాలనీ, కంద్రపేట, పెద్దపల్లిపేట గ్రామాల్లోని పలు ట్యాంకుల్లో నాచు పేరుకుపోవడంతో పాటు బురద కూడా ఉండటాన్ని గుర్తించారు. ఎట్టకేలకు క్లోరినేషన్ చేసిన నీటిని సరఫరా చేయడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పెచ్చులూడిన గదిలో విద్యార్థుల పాట్లు



రణస్థలం బీసీ హాస్టల్లో పెచ్చులూడిన శ్లాబ్ చూపుతున్న విద్యార్థులు

రణస్థలం: ప్రభుత్వ సంక్షేమ హాస్టల్లో వసతులు లేక, ధరలకు అనుగుణంగా మెనూ చార్జీలు పెంచకపోవడం వల్ల విద్యార్థులు దుర్భర జీవితాలు అనుభవిస్తున్నారని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు సీహెచ్ అమ్మన్నాయుడు, రణస్థలం శాఖా కార్యదర్శి వెలమల రమణ అన్నారు. శుక్రవారం రణస్థలం బీసీ సంక్షేమ హాస్టల్‌ను సందర్శించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థుల గదులు, భోజనశాలలో శ్లాబ్‌లు పెచ్చులు ఊడిపోతుండటంతో భయపడుతున్నారని, వర్షం పడితే గదులు కారిపోతున్నాయని చెప్పారు. హాస్టల్ నిర్వహణను ప్రభుత్వం గాలికొదిలేసిందని దుయ్యబట్టారు. ప్రభుత్వం తక్షణమే పెరిగిన ధరలకు అనుగుణంగా మెనూ చార్జీలు పెంచాలని, శుద్ధి చేసిన మంచినీరు సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు.

పనులు చేస్తుండగానే పగుళ్లు

- ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్ కాంపౌండ్ నిర్మాణంలో నాణ్యతా లోపం
- పట్టించుకోని అధికారులు

శ్రీకాకుళం పాతబస్టాండ్ : ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్ నిర్మాణంలో భాగంగా కలెక్టరేట్ కాంపౌండ్‌లో జరుగుతున్న పనుల్లో నాణ్యతపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కాలువలు, వాహనాల పార్కింగ్ నిర్మాణ పనులు లోపభూయిష్టంగా ఉంటున్నాయి. ఒకవైపు కాలువ నిర్మాణాలు జరుగుతుండగానే.. అదే సమయంలో కాలువపై కప్పుడు వేస్తున్నారు. దీంతోకాలువ గోడలు బీటలు వారుతున్నాయి. అయినప్పటికీ కాంక్రీట్ పలకలతో పైకప్పులు వేస్తున్నారు. ఇటీవల అధికారులు పరిశీలించినా బీటలు గుర్తించకపోవడం గమనార్హం. ఇలాంటి నిర్మాణలు చేస్తే, ఆ పనులు ఎన్నాళ్లు ఉంటాయో తెలియని పరిస్థితి. సుమారు అర కోటి ఖర్చుతో చేపడుతున్న కాంక్రీట్ గోడలు ఇప్పుడే ఇలా ఉండటం పట్ల నాణ్యత పలువురు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.



ఇరువైపులా బీటలు వారిన కాలువ కాంక్రీట్ గోడలు

బాల్య వివాహాలు నిర్మూలించాలి

శ్రీకాకుళం అర్బన్: బాల్య వివాహాలు నిర్మూలించాలని సర్వ శిక్షా అభియాన్ ఏపీసీ ఎస్.శశిభూషణ్ అన్నారు. అంతర్జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ, జిల్లా బాలల రక్షణ విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం శ్రీకాకుళంలో భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా మహిళా, శిశు సంక్షేమ, సాధికారత అధికారి ఐ.విమల, బాలల సంక్షేమ సమితి చైర్‌పర్సన్ యు.శ్రీలక్ష్మి, జిల్లా బాలల రక్షణ అధికారి కె.వి.రమణ, జిల్లా మిషన్ కో-ఆర్డినేటర్ డి.ఉమామహేశ్వరి, నోడల్ అధికారి కె.మణెమ్మ, ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కె.సూర్యచంద్రరావు, సిబ్బంది పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, సిబ్బంది, విద్యార్థులు

ఆకట్టుకున్న ప్రదర్శనలు

శ్రీకాకుళం కల్చరల్ : నగరంలోని ఎన్‌టీఆర్ మున్సిపల్ హైస్కూల్ మైదానంలో జీఎస్‌టీ ఉత్సవ్‌లో భాగంగా సాంస్కృతికోత్సవాలు కొనసాగుతున్నాయి. శుక్రవారం రాత్రి బెండి మాధురి, కూన వరలక్ష్మి ఆధ్వర్యంలో సంప్రదాయ కూచిపూడి నృత్యాలు అలరించాయి.



సంప్రదాయ ప్రదర్శన

సంక్షిప్తంగా..

అధికారుల తీరుపై కలెక్టర్ ఆగ్రహం

శ్రీకాకుళం: శ్రీకాకుళం నగరపాలక సంస్థ అధికారుల పనితీరుపై కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. గురువారం రాత్రి నగరపాలక సంస్థ అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహిస్తున్న సమయంలో పెదపాడు రోడ్డులో సెంటర్ డివైడర్, సెంటర్ లైటింగ్ పనుల విషయం ప్రస్తావనకు వచ్చింది. పనులు తక్షణం చేపట్టాలని ఆదేశించినా ఇప్పటివరకు ప్రారంభించకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. సుడా నిధులు సమకూర్చినా పనులు ఎందుకు ప్రారంభించలేదని కమిషనర్, ఇంజినీరింగ్ అధికారులను ప్రశ్నించారు. దీనిపై వారి నుంచి సరైన సమాధానం రాకపోవడంతో ఇద్దరినీ సరెండర్ చేస్తానని హెచ్చరించారు. అటు తర్వాత కూడా మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ రాష్ట్ర అధికారులతో ఇదే విషయమై మాట్లాడినట్లు అత్యంత విశ్వసనీయంగా తెలిసింది .

పేదరిక నిర్మూలనకు పాటుపడాలి

శ్రీకాకుళం న్యూకాలనీ: దేశంలో పేదరికాన్ని నిర్మూలించేందుకు ప్రతిఒక్కరూ పాటుపడాలని శ్రీకాకుళం ప్రభుత్వ మహిళా డిగ్రీ (అటానమస్) కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కింతలి సూర్యచంద్రరావు అన్నారు. కళాశాలలో శుక్రవారం 'అంతర్జాతీయ పేదరిక నిర్మూలనా దినోత్సవాన్ని 'ఆర్థికశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆర్థికశాస్త్ర విభాగాధిపతి, సీఓఈ టి.ఆదిలక్ష్మి, డాక్టర్ బి.ప్రభాకర్, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.చిన్నారావు, ఐక్యుఏసీ కో-ఆర్డినేటర్ డాక్టర్ ఎస్.పద్మావతి, అకడమిక్ కో-ఆర్డినేటర్ కె.మౌనిక తదితరులు పాల్గొన్నారు.

కొబ్బరిలో తెగుళ్లపై అవగాహన

రణస్థలం: కొబ్బరి తోటల్లో ఎరువులు, పురుగుల, తెగులు యాజమాన్యంపై రైతులు అవగాహన కలిగి ఉండాలని నైరా కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ అనిల్‌కుమార్ అన్నారు. సీహెచ్ రాజాం, మెంటాడ గ్రామాల్లో కొబ్బరి పంట తెగుళ్లపై శుక్రవారం అవగాహన కల్పించారు. ఉద్యానవన అధికారి అమర్వేశరి, హార్టికల్చర్ అసిస్టెంట్ నరేంద్రకుమారి, హెచ్ఈవో నీరజ తదితరులు పాల్గొన్నారు.

మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ

శ్రీకాకుళం అర్బన్: పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటి శ్రీకాకుళం జిల్లాను గ్రీన్ జిల్లాగా మారుద్దామని జిల్లా ఎన్విరాన్‌మెంట్ చైర్మన్ పొన్నాడ రవికుమార్ అన్నారు. నగరంలోని బీఎస్ఎన్ఎల్ కార్యాలయ ఆవరణలో లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ ఆధ్వర్యంలో బీఎస్ఎన్ఎల్ ఎస్‌డీఈ మార్కెటింగ్ బెండి రమేష్, క్యాఫ్ బట్న కుసుమ, లాసా ఫౌండేషన్ సభ్యులు టి.శ్రీనివాసరావు తదితరులు మొక్కలు నాటారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ అధ్యక్షురాలు డాక్టర్ పైడి సింధూర, సెంట్రల్ కార్యదర్శి టెక్కం రామ్‌గోపాల్, ఉపాధ్యక్షులు బి.ఉమామహేశ్వరరావు, ఉర్లం శివతేజ, సభ్యులు చౌదరి శ్రీనివాస్, బీఎస్ఎన్ఎల్ సిబ్బంది పాల్గొన్నారు.

వచ్చే రబీకి సాగునీరు

జి.సిగడాం: మడ్డువలస కాలువ ద్వారా వచ్చే రబీ సీజన్‌కు పూర్తిస్థాయిలో సాగునీరు అందేలా చర్యలు తీసుకుంటున్నామని ప్రాజెక్టు డీఈఈ నాగేశ్వరరావు వెల్లడించారు. శుక్రవారం దేవరవలసలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ మొక్కజొన్న పంటకు ఫిబ్రవరి వరకు కాలువ ద్వారా సాగునీరు అందిస్తామన్నారు. ఆయనతో పాటు ఏఈఈలు కోటేశ్వరరావు, రాజశేఖరం, సిబ్బంది ఉన్నారు.